అనుమతి లేని ఆధార్ కేంద్రం సీజ్

తాండూరు, జనవరి 3: తాండూరు పట్టణంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. తాండూరు పట్టణం సిసిఐ కాలనీలో జిరాక్స్ సెంటర్ కొనసాగిస్తూ అనుమతి లేకుండా ఆధార్ సెంటర్ ను కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ రాజిరెడ్డి తనిఖీ చేసి కంప్యూటర్ స్కానింగ్ ప్రింటర్లను స్వాధీనం చేసుకున్నారు.

- జీవో 69, రైల్వేలైన్, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై దృష్టి
- నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలో ఉండేలా ప్రయత్నాలు
- కొడంగల్ కేంద్రంగా జిల్లా, రెవెన్యూ డివిజన్ ప్రస్తావన
- అభివృద్ధిపై అధికారుల కసరత్తు .. కడా ఏర్పాటు

అభివృద్ధి పరంగా అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ బాగుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ముక్కలుగా చేశారని పలు సందర్భాల్లో రేవంత్‌రెడ్డి పేర్కొనడం తెలిసిందే. ఈ క్రమంలో కొడంగల్ అభివృద్ధికి కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించారు. కొడంగల్‌ను జిల్లా, రెవెన్యూ డివిజన్‌గా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మోడల్.. కొడంగల్!



నియోజకవర్గంపై సీఎం స్పెషల్ ఫోకస్

కొడంగల్, జనవరి3: అభివృద్ధి పరంగా అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించారు. వర్షాభావ పరిస్థితులపై ఆధారపడి జీవిస్తున్న ఈ ప్రాంత రైతులకు మేలు కలిగేలా జీవో నెం.69ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గ పరిధిలోని అన్నీ మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలతోపాటు ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, క్రీడాకారుల కోసం స్టేడియం ఏర్పాటుకు స్థల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సౌకర్యాలపై అధికారుల కసరత్తు చేస్తున్నారు. మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ అస్తిత్వాన్ని కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

సాగు నీటి కోసం చర్యలు

విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతం 80 శాతానికిపైగా వ్యవసాయాధారిత పంటలపైనే ఆధారపడి ఈ ప్రాంత ప్రజలు జీవనం కొనసాగిస్తారు. దీంతో అప్పట్లో 2014 మే నెలలో గవర్నర్ నరసింహన్ పాలన కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి జీవో నెం.69 మంజూరు చేయించారు. దీంతో భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరుతో 10వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంగా ముందుకు వెళ్లారు. అయితే అప్పట్లో తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో ఆ జీవో నెం.69ని పెండింగ్‌లో ఉంది. రైతుల సాగునీటి కల నెరవేర్చేందుకు తిరిగి ఈ జీవోకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తుంది.

భారీ పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు

ఎన్నికల హామీల్లో భాగంగా రైల్వేలైన్, పరిశ్రమల ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో పదే, పదే చెప్పారు. దీంతో ఇప్పటికే కేంద్రప్రభుత్వం కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్‌ను మక్తల్, నారాయణపేట, మద్దూర్, కోస్గి, కొడంగల్ కేంద్రాల మీదుగా పరిగి, వికారాబాద్ వరకు నూతన రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రైల్వేలైన్ ఏర్పాటు కోసం భూసేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండటంతో కొడంగల్ నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండటంతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం కానుంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన రేవంత్‌రెడ్డి కొడంగల్ మండలం ఇందనూర్, ధర్మాపూర్ సరిహద్దులో పరిశ్రమల ఏర్పాటు కోసం సర్వేలు చేయించారు.

అసెంబ్లీ స్థానం మొత్తం ఒకే జిల్లా పరిధిలోకి..

అప్పట్లో రాజకీయంగా దెబ్బతీయాలనే నెపంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గాన్ని మూడు ముక్కల చేసింది. దీంతో కొడంగల్ నియోజకవర్గం కొన్ని రోజులు మూడు జిల్లాల పరిధిలో కొనసాగగా ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో మూడు మండలాలు, నారాయణపేట జిల్లాలో రెండు మండలాలు కొనసాగాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి కొడంగల్‌ను చక్కదిద్దే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల పరిధిలో ఉన్న కొడంగల్ నియోజకవర్గాన్ని ఒకే జిల్లా పరిధిలో ఉండేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇదే సమయంలో కొడంగల్‌ను జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.


కొడంగల్ చౌరస్తా

నియోజవర్గంలో 8 మండలాలు

కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 8 మండలాలు, రెండు మున్సిపాలిటీలున్నాయి. నూతనంగా ఏర్పడిన మండలాల్లో దుద్యాల, బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ పరిధిలో ఉండగా కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలు నారాయణపేట జిల్లా పరిధిలో ఉన్నాయి. కొడంగల్ మున్సిపల్ వికారాబాద్‌లో, కోస్గి మున్సిపల్ నారాయణపేట జిల్లా పరిధిలో కొనసాగుతుండగా సగం మండలాలు తాండూరు రెవెన్యూ డివిజన్, మిగతా మండలాలు నారాయణపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గ కేంద్రం మాత్రం వికారాబాద్ జిల్లాలో ఉంది. పార్లమెంట్ పరిధిలోకి వస్తే, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు మహబూబ్‌నగర్ పరిధిలోకి వస్తున్నారు. సహకార సంఘం చైర్మన్లు ఇతరాత్ర మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండగా వీటిని చక్కదిద్దనున్నారు.

పాలనాపరంగా ఇబ్బందులు

కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 4మండలాలు, ఒక మున్సిపాలిటీ వికారాబాద్ జిల్లాలో, మరో4 మండలాలు, ఒక మున్సిపాలిటి నారాయణపేట జిల్లాలో కొనసాగుతుండటంతో పరిపాలన పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంత మేధావులు, ఉద్యోగులు కొడంగల్ నియోజకవర్గ కేంద్రాన్ని జిల్లా లేదా రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతున్నారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గాన్ని అటు నారాయణపేట, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలో కలపడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. కొడంగల్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించి వెనకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. ఉదాహరణకు గతంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా కేవలం నియోజకవర్గం వనపర్తిని జిల్లాగా ఏర్పాటు చేశారు. అదే తరహాలో కొడంగల్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటున్నారు. ఏదీ ఏమైనా సీఎంగా రేవంత్‌రెడ్డి ఉండటంతో కొడంగల్ నియోజకవర్గం అన్నీ విధాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.


లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రత్యేక నిధులతో బంట్వారం, కోట్‌పల్లి అభివృద్ధికి కృషి

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

బంట్వారం, జనవరి3: బంట్వారం, కోట్‌పల్లి మండలాలను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం బంట్వారంలో నిర్వహించిన ప్రజాపాలన,కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైనమాట్లాడారు. కోట్‌పల్లి బంట్వారం మండలాలకు మొదటి ప్రాధాన్యతగా రోడ్లను అభివృద్ధి చేస్తానని, ఆరు గ్యారంటీలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముఖ్యంగా బంట్వారం ఎంతో వెనుకబడిఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తానని అన్నారు. ముఖ్యంగా మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లే రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటిని బాగుచేయిస్తానని అన్నారు. అర్హులైన వారందరూ రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, జడ్పీటీసీ సంతోషరాజు, ఎంపీపీలు ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు లావణ్యశ్రీనివాస్, నర్సింహారెడ్డి, ఎంపీటీసీలు శ్రీకాంత్‌రెడ్డి, పద్మావెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, తౌఫిక్ పాల్గొన్నారు.


చైతన్యనగర్‌లో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

చెంచులకు మౌలిక సదుపాయాలు

- ప్రస్తుత వసతులపై ఆరా తీసిన కలెక్టర్ నారాయణరెడ్డి

పెద్దేముల్, జనవరి3: గిరిజనుల జీవితాలను మెరుగుపరిచేందుకు కేంద్రం పీఎం జన్మాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్‌లో బుధవారం ఈపథకం కింద పొందాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ చెంచుకుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో 22 గ్రామాలు ఉన్నాయని, వాటిలో 776 కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. 11 ముఖ్యమైన కనీస సౌకర్యాలను సూచిస్తూ అవి అందరికీ ఉన్నాయా లేదా అని చెంచులను అడగగా ఏసౌకర్యాలు లేవని చెప్పారు. పీఎం జన్మాన్ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వారం రోజుల్లో అన్ని సౌకర్యాలు అందే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గురువారం నుంచి ఆయా గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం నుంచే చైతన్యనగర్‌లో ఆధార్‌సెంటర్ ఏర్పాటు చేసి కార్డులజారీ, అప్‌డేట్ పనులు మొదలుపెట్టారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పి.లలిత, డీటీడబ్ల్యువో కోటాజి, ఏడీఏ గోపాల్, డీఈవో రేణుక, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, డీఎంహెచ్‌వో పాల్వాన్‌కుమార్, బాబు, శ్రీనివాస్, తహశీల్దారు కిషన్, వైద్యులు బుచ్చిబాబు, ఆర్ఐ.రాజిరెడ్డి, ఏఈవో బాలకోటేశ్వర్ రావు, పంచాయతీ కార్యదర్శి నాగరాణి తదితరులు పాల్గొన్నారు. కాగా పెద్దేముల్ మండలం బుద్దారం గ్రామంలో ప్రజాపాలన సదస్సులో కలెక్టర్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఆరు గ్యారంటీలు కాకుండా సాధారణ దరఖాస్తులు చేసుకున్న వారికి అధికారులు రశీదులు ఇవ్వడం లేదు. దీంతో కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే దరఖాస్తు చేసుకున్న వారందరికి రశీదులు ఇవ్వాలని ఆదేశించారు.

దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే మోదీ లక్ష్యం

- తెలంగాణ అభివృద్ధికి రూ. లక్షల కోట్లు ఇచ్చాం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి

మేడ్చల్ టౌన్, జనవరి 3 : భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితా నుంచి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రధాని మోడీ పని చేస్తున్నారని కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్, సైదోనిగడ్డ తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు స్ర్కీన్‌పై చూపుతూ వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపాలన్న సంకల్పంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేన్నారు. పదేళ్లుగా తెలంగాణకు లక్షల కోట్ల రూపాయల ఇచ్చి అభివృద్ధికి సహకరించామన్నారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి కోసం రూ.4500 కోట్లు ఇచ్చామని, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం వందల కోట్లు ఇచ్చామన్నారు. జల్ జీవన్ పథకాన్ని గత ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకో లేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైన సక్రమంగా వినియోగించుకుని ఇంటింటికీ నీరు సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల స్టాల్స్‌ను పరిశీలించారు. స్వయం సహాయక గ్రూపులు తయారు చేసిన పరికరాలను తిలకించారు. అనంతరం పొలాల్లో క్రిమి సంహారక మందులను పిచికారి డ్రోన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, వ్యవసాయశాఖ అధికారి అర్చన, రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్రం మంత్రి ప్రహ్లాద్ జోషి


తాండూరు - వికారాబాద్ రోడ్డు

మన్నెగూడ - తాండూరుకు నాలుగు లేన్ల రోడ్డు

- కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు
- బూత్‌పూర్ నుంచి వయా కొడంగల్, తాండూరు మీదుగా ఎన్‌హెచ్ పనులు

తాండూరు :జనవరి 3 : వికారాబాద్ జిల్లా మన్నెగూడ నుంచి తాండూరు వరకు నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తాజాగా ప్రతిపాదనలు పంపించింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోడ్లను 4లేన్ రోడ్లుగా విస్తరించేందుకు గాను కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించగా అందులో మన్నెగూడ నుంచి తాండూరు వరకు ఉంది. మహబూబ్‌నగర్ బూత్‌పూర్ నుంచి వయా కోడంగల్, తాండూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారులు అనుసంధానం చేస్తూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రూ. 1,336 కోట్లతో పనులు చేపట్టింది. 167 ఎన్‌హెచ్‌గా నామకరణం చేసి 102 కిలో మీటర్ల మేరకు ఈ రహదారిని అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే మన్నెగూడ నుంచి వయా తాండూరు మీదుగా జహీరాబాద్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాల్సి ఉంది. మన్నెగూడ నుంచి తాండూరుకు 50 కిలో మీటర్ల దూరం అవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో పాటు ఈప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, నేషన్‌హైవే అథారటీ అధికారులను కలిసి నాలుగు లేన్ల రోడ్డు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. కేంద్రం నుంచి అప్రోల్ రావల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గనున్నాయి. త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

కంకర పరిచారు.. తారు మరిచారు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని వాహనదారుల వినతి

బషీరాబాద్, జనవరి 3: బషీరాబాద్-తాండూరు ప్రధాన ఆర్అండ్బీ రోడ్డు మార్గం అగ్గనూరు సమీపంలో రహదారి పనితీరుకు అద్దం పడుతోంది. గుంతలమయంగా మారిన ఈ మార్గాన్ని పునరుద్ధరించేందుకు కాంట్రాక్టర్ కిలో మీటరుకు పైగా తారు తొలగించి కంకర పరిచారు. గత మూడు నెలల కిందట కంకర పరిచిన కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో తమకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా నిత్యం 50 గ్రామాల నుంచి ప్రజలు పలు రకాల వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కంకర పరిచిన రోడ్డుపై ద్విచక్ర వహనాలపై వెళ్లాలంటే అక్కడా వెలువడుతున్న దూమ్ముతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనదారులు పలువురు విన్నవిస్తున్నారు.



బషీరాబాద్-తాండూరు ఆర్అండ్బీ మార్గంలో అగ్గనూరు వద్ద కంకర పరిచి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

జడ్పీ చైర్మన్ పరామర్శ

ఘట్కేసర్, జనవరి 3: ఘట్కేసర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు సుధాకర్రావు మాతృమూర్తి రుక్కమ్మ బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్చంద్రారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క ప్రభాకర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలుపుతున్న శరత్చంద్రారెడ్డి

మంత్రి పొంగులేటికి పూర్వ వీఆర్ఏల సన్మానం

వికారాబాద్, జనవరి 3: వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పూర్వ వీఆర్ఏలకు వెంటనే ఐడీలు కేటాయించి పెండింగ్లో ఉన్న అయిదు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ హక్కుల సాధన సమితి, రాష్ట్ర వీఆర్ఏల జేఏసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం వారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్లను కలిసి సన్మానించి ధన్యవాదాలు చెప్పారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పూర్వ వీఆర్ఏల సమస్యలు పరిష్కరించి 20వేల కుటుంబాల్లో సంతోషం నింపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పూర్వ వీఆర్ఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేశారంటూ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన చైర్మన్ విజయ్తో పాటు సమితి కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు చిరంజీవి, సంకీర్తన, సునీత, సరోజ, శ్రీధర్గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ మంత్రి శ్రీనివాస్రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ వీఆర్ఏలు

కడా ప్రత్యేకాధికారిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, జనవరి 3: కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆథారిటీ (కడా) ప్రత్యేకాధికారి కుంచాల వెంకట్రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, సభ్యులు యం.వెంకటేశం, ఏ.రమేశ్, జీ.రాము, కృష్ణ, కృష్ణంరాజు, బాబు, గోపాల్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.



కడా ప్రత్యేకాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పించన్ల పంపిణీలో డబ్బులు తీసుకున్నాడని..

● అధికారుల విచారణ

తాండూరు రూరల్, జనవరి 3: తాండూరు మండలం కరన్కోట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ పింఛన్ల పంపిణీలో డబ్బులు తీసుకున్నాడనే ప్రజాపాలనలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు బుధవారం విచారణ జరిపారు. జిల్లా డీఆర్డీఏ డీపీవో నర్సింహులు, తాండూరు పోస్టల్ ఇన్స్పెక్టర్ రాకేష్రెడ్డిలు కరన్కోట్ గ్రామానికి వెళ్లి గ్రామ సర్పంచ్ వీణ, ఉపసర్పంచ్ హేమంత్కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను పిలిచి విచారణ జరిపారు. అయితే, క్షేత్రస్థాయిలో తాము విచారణ జరుపగా ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు డీఆర్డీఏ డీపీవో నర్సింహులు, తాండూరు పోస్టల్ ఇన్స్పెక్టర్ రాకేష్రెడ్డిలు తెలిపారు.

మైల్వార్ గ్రామ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

బషీరాబాద్, జనవరి 3: మండలంలోని మైల్వార్ గ్రామ కార్యదర్శి నర్సింహాగౌడ్కు జిల్లా పంచాయతీ అధికారి తరుణ్కుమార్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బషీరాబాద్ ఎంపీడీవో రమేష్ బుధవారం ఈ విషయాన్ని ధృవీకరించారు. మైల్వార్ గ్రామంలో మంగళవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామసభనుద్దేశించి మాట్లాడుతుండగా మైక్సెట్ పలుమార్లు మొరాయించింది. దీంతో ఎమ్మెల్యే అక్కడున్న అధికారులపై మైక్సెట్ను కూడా సరగా చూసుకోరా అంటూ మండిపడ్డారు. ప్రభుత్వం గ్రామ సభల నిర్వహణకు రూ.10వేలు ఇస్తుండగా కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశానుసారం డీపీవో తరుణ్కుమార్ అదేరోజు సాయంత్రం కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీచేస్తూ మెయిల్ చేశారు.

దేవేందర్‌గౌడ్ నివాసానికి కేంద్ర మంత్రి

మహేశ్వరం, జనవరి 3 : కేంద్ర బొగ్గు గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్‌జోషి బుధవారం తుక్కుగూడలో మాజీ ఎంపీ టీడీదేవేందర్‌గౌడ్‌తో పాటు ఆయన కుమారుడు వీరేందర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు దేవేందర్‌గౌడ్ నివాసంలో కలిసిన ప్రహ్లాద్ జోషి వారితో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రానున్న పార్లమెంటు ఎన్నికలపై చర్చించినట్లు సమాచారం.

నేడు మాణిక్యమ్మగూడకు కేంద్ర మంత్రి రాక

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా నేడు(గురువారం) మండల పరిధిలోని మాణిక్యమ్మగూడకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పర్యటించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈమేరకు వివిధ శాఖల అధికారులు గ్రామంలో తగిన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాదవాచారి, భూపాల్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దేవేందర్‌గౌడ్‌తో సమావేశమైన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

పనిచేయని నిఘా నేత్రాలు!

- సీసీ కెమెరాలున్నా ఫలితం సున్నా
- కూడళ్లు, రోడ్ల వెంట ఉన్న సీసీ కెమెరాలు మూలకు
- పట్టించుకోని అధికారులు

నందిగామ, జనవరి 3: ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కానీ ప్రతీ క్షణాన్ని వీడియోలో నిక్షిప్తం చేసేలా ఏర్పాట్లుంటే దేన్నైనా విశ్లేషించడం సులువు. ముఖ్యంగా నేర సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరిగేసుకున్న సమయాల్లో పోలీసు విచారణకు వీడియో రికార్డుల ఫుటేజీలు ఎంతో ఉపయోగపడుతాయి. అందుకే పోలీసు శాఖ, ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా రోడ్ల వెంట, ప్రభుత్వం ప్రైవేట్ కార్యాలయాల్లో ఈ కాలంలో సీసీ కెమెరాలు, టీవీల వాడకం సాధారణం. ఇంత కీలకమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు కానీ వాటి నిర్వహణపై పట్టించుకునే నాథుడు లేడు. నందిగామ మండలంలో దాతలు, ప్రజాప్రతినిధుల విరాళాలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. ముఖ్యంగా వాటి నిర్వహణను పంచాయతీలు, అధికారులు పట్టించుకోకే ఈ పరిస్థితి దాపురించింది. చౌరస్తాలు, పట్టణ, గ్రామ ముఖద్వారాలు, రద్దీ ప్రదేశాల్లో, క్రీడల విరివిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో అందరి ప్రయత్నం, డబ్బు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. నేరాల అదుపునకు సీసీ కెమెరాలను ఏర్పాటును అందరూ ప్రోత్సహించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ప్రజల్లో అవగాహన కల్పించి నివాసాలు, వ్యాపార కేంద్రాల్లో సీసీ కెమెరాలు, టీవీలను ఏర్పాటు చేయించినా నిర్వహణ లేక ఫలితం లేకుండా పోతింది.


నందిగామ బైపాస్ రోడ్డులోని కూడలిలో పనిచేయని సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలున్నాయి.. కానీ పనిచేయవు!

మండలంలో పరిశ్రమల్లో తప్ప ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని రోజుల క్రితం పోలీసుస్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి చంద్రయ్య అనే రైతు గాయపడ్డాడు. అయితే అతడి బైక్‌ను ఢీకొన్న వాహనాన్ని పోలీసులు గుర్తించలేకపోయారు. కారణం అక్కడున్న సీసీ కెమెరాలు పనిచేయకపోవడం. నందిగామ చౌరస్తా వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే ప్రమాదానికి కారణమైన వారు తెలిసిపోయేవారు. దీంతో రైతుకు చికిత్సయ్యే ఖర్చును ఢీకొన్న వాహనదారు భరించడంతో పాటు రైతుకు జరిగిన నష్టానికి సైతం పరిహారం అందేది. సీసీ కెమెరాలు పనిచేయక రైతుకు న్యాయం జరగలేదు. అలాగే నందిగామ బైపాస్‌రోడ్డులో నందిగామకు చెందిన యూసుఫ్ రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని మృతిచెందాడు. అక్కడా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రమాద కారకులు తెలియలేదు. మండలంలోని రంగాపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక గతంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ అపహరించిన దొంగలు పట్టుబడలేదు. నందిగామ మండలం పారిశ్రామిక ప్రాంతం. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉపాధి కోసం వస్తుంటారు. ఇటువంటి చోట నేరాలు జరిగే అస్కారం ఎక్కువ. కూడలి ప్రదేశాలు, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, టీవీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాలం చెల్లిన సీసీ కెమెరాలను మార్చి కొత్తవి అమర్చాలి. అధికారులు, పోలీసులు పట్టించుకుంటేనే ఇవన్నీ సాధ్యం. సీసీ కెమెరాల ఏర్పాటు వెనుక ఉన్న లక్ష్యం నెరవేరేది ఇప్పుడే!

సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యం



ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ అవశ్యం. 2నెలల క్రితం నంది గామలో జంట హత్యలు జరిగాయి. సీసీ కెమెరాలుంటే హంతకులను పట్టుకునే అవకాశం ఉండేది. సీసీ కెమెరాలతో నేరాల అదుపు కూడా సాధ్యమే. నందిగామ పెద్ద పారిశ్రామిక వాడ. నేరస్తులు ఇలాంటి ప్రదేశాలను అడ్డాగా చేసుకుంటారు. కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నేర నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- విక్రమ్‌శర్మ, న్యాయవాది, నందిగామ

కెమెరాలు పనిచేసేలా చూస్తున్నాం



ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు నిర్మాణంలో కేబుల్స్ కట్ అయి సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. నేరాలకు పాల్పడే వారి సమీపంలో సీసీ కెమెరాలు ఉంటాయా? లేదా అని గమనిస్తున్నారంటే అవి ఎంత కీలకమో తెలుస్తోంది. అన్ని ఫ్యాక్టరీలు, ఆలయాలు, దుకాణాలు, స్కూళ్లు, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిని పోలీస్‌స్టేషన్ నుంచి మానిటరింగ్ చేస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి.

\- సురేష్, ఇన్‌స్పెక్టర్, నందిగామ

మంత్రి సురేఖకు జడ్పీటీసీ శుభాకాంక్షలు

కేశంపేట, జనవరి 3: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలక్ష్మ బుధవారం పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలో మంత్రి చాంబర్‌లో జడ్పీటీసీ దంపతులు సురేఖను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.




హిమాయత్ నగర్‌లో నిర్మాణాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అక్రమ నిర్మాణాల తొలగింపు

మొయినాబాద్ రూరల్, జనవరి 3 : మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి జేసీబీల సహాయంతో బుధవారం తొలగించారు. గ్రామంలోని సర్వేనెంబర్ 145లోని 9 ఎకరాల భూమిలో నగరానికి చెందిన కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి సిబ్బంది, జేసీబీల సహాయంతో అక్కడికి చేరుకొని నిర్మాణాలను తొలగించారు. ఈ నిర్మాణాలు చేపట్టిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే గతంలో ఇదే స్థలం వివాదంలో హైకోర్టులో కేసు కొనసాగింది. తీర్పు ఒక వర్గానికి అనుకూలంగా వచ్చినా.. మరో వర్గానికి చెందినవారు అప్పటి ప్రభుత్వంలోని కొందరి పెద్దల సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



గుప్తనిధుల కోసం తవ్వకాలు

ఫాంహౌస్ యజమానిని ప్రశ్నించిన పోలీసులు

శంషాబాద్ రూరల్, జనవరి 3: శంషాబాద్ మున్సిపల్ పరిధి తొండుపల్లిలో గల ఓ ఫాంహౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి గుప్తనిధుల తవ్వకాలు జరిపారు. 20 ఫీట్ల లోతు సొరంగం తవ్వారు. తవ్వకాలు చేసిన చోట నిమ్మకాయలు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలతో క్షుద్రపూజలు చేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. ఫాంహౌస్ యాజమాని ముక్తార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. భూమిలో రంగురాళ్లు ఉన్నట్లు ఎవరో చెబితే తవ్వకాలు చేశామని అతడు ఒప్పుకున్నాడని సీఐ శ్రీధర్‌కుమార్ తెలిపారు. రెండుచోట్ల తవ్వకాలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని సీఐ తెలిపారు. కాగా ఘటనపై తమకు సమాచారం ఇచ్చారు తప్పితే ఎవరూ ఫిర్యాదు చేయాలేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ వివరించారు.


మద్దుల : మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల, జనవరి 3: 'పేదల జీవితాల్లో మార్పు తీసుకువచ్చి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆయా చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయికి తీసుకుపోయిన ఘనత సీఎం రేవంత్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలందరికి ఆరు గ్యారంటీ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను సూచించారు. పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, ఎంపీపీ పద్మారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో రామయ్య, డీటీ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిక్కు కిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తపొండు గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మహేష్, వెంకట్‌రాంరెడ్డి

సాయిరెడ్డిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలి

కందుకూరు, జనవరి 3 : సాయిరెడ్డిగూడకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలి సర్పంచ్ మహేష్, ప్యాక్స్ డైరెక్టర్ ఎస్.వెంకట్‌రాంరెడ్డిలు బుధవారం తహసీల్దార్ కె.గోపాల్, ఎంపీడీవో వెంకట్రాములకు వినతిపత్రం ఇచ్చారు. బుధవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సభకు అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధికారులకు సమస్యను విన్నవించారు. తమ గ్రామానికి 20 ఏళ్లుగా మిదాని డిపోకు చెందిన బస్సు నగరం నుంచి వచ్చేదన్నారు. ఇటీవల బస్సు సర్వీసు నిలిపివేయడంతో గ్రామస్థులు, రైతులు, పాల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా, ఎంపీడీవో వెంకట్రాములు మాట్లాడుతూ బుధవారం మండలంలోని సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, కొత్తూరు, గూడూరు, పెద్దమ్మతాండ, దావుద్‌గూడతండాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. సర్పంచ్ మహేష్, రాజశ్రవీణ్‌నాయక్, పల్లె వసంత కృష్ణగౌడ్, సుమన్‌నాయక్, అనిత, ఎంపీటీసీ ఇందిరదేవేందర్, తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పరిగి, జనవరి 3: ఎస్టీయూ 2024 క్యాలెండర్‌ను బుధవారం పరిగిలో ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేసి మంచి ఫలితాలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రతినిధులు కనకదారి, దయాకర్, యాదయ్య, అంజిలయ్య, ఖలియాన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

మోదీ విజన్‌తో అందరికీ సంక్షేమ పథకాలు

కేశంపేట, జనవరి 3: ప్రధాని మోదీ విజన్‌తో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య వివరించారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బాబయ్య మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ప్రధాని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి సభ్యుడు శివాజీ, యుగుందర్, రామచేందర్, జహీద్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే గుర్తింపు

తలకొండపల్లి, జనవరి 3: ప్రతిభ ఆధారంగానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న స్పందన ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాల ఆవరణలో స్పందనకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో స్పందనను సత్కరించి అభినందించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. జడ్పీ కోఆప్షన్‌సభ్యుడు ముజుబూర్ రహిమాన్, సర్పంచ్ సంగీత, హెచ్‌ఎం రజాక్, శేఖర్, లీల, పీఈటీ పరమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిష్యుడు ఎమ్మెల్యే కావడమే గొప్ప గురుదక్షిణ

షాద్‌నగర్ అర్బన్, జనవరి 3: తన శిష్యుడు వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే కావడమే గొప్ప గురుదక్షిణ అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపాలస్వామి అన్నారు. ఈమేరకు వీర్లపల్లి ఎమ్మెల్యే అయ్యాకన్న ఉత్సాహంతో స్వయంగా కృష్ణుడి ఫోటోను చిత్రీకరించి బహూకరించి, ఆశీర్వదించి, ఆనందించాడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపాలస్వామి. బుధవారం ఆయన స్వయంగా శంకర్ ఇంటికి వెళ్లి ఫోటో బహూకరించి ఆశీర్వదించారు. చిన్ననాటి గురువు, తన ఫోటోను చిత్రీకరించి ఇవ్వడంతో ఎమ్మెల్యే ఆనంద భాష్పాలతో గురువుకు పాదాభివందనం చేశారు. కాగా, షాద్‌నగర్ పట్టణంలోని క్రిష్టియన్ కాలనీకి చెందిన గోపాలస్వామి నందిగామ పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో వీర్లపల్లి అదే పాఠశాలలో చదువుకున్నాడు. పాఠశాలలో శంకర్ చురుకుదనం, సమయస్ఫూర్తిని చూసి గొప్పగా ఎదుగుతాడని భావించానని, నా ఆలోచనకు అనుగుణంగా ఎమ్మెల్యే కావడం, గురువు అంతకన్నా గొప్ప ఆనందం ఏముంటుందని గోపాలస్వామి అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే వీర్లపల్లికి ఎంపీపీ సన్మానం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలను బీఆర్‌ఎస్‌కు చెందిన ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీస్ సన్మానించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీని వారు సన్మానించి, స్వీటు తినిపించారు. ఈ ద్వయాలు అక్కడున్న కాంగ్రెస్ నాయకులకు ఆనందాన్ని కల్గించాయి.


ఎమ్మెల్యే శంకర్‌కు ఫొటోను బహూకరిస్తున్న గురువు గోపాలకృష్ణ

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం

శంకర్‌పల్లి/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, జనవరి 3 : నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడుతాయని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలో దాతలు అనంతరెడ్డి రూ.15లక్షలు, కౌన్సిలర్ కిషన్ రూ.నలక్షలు సమకూర్చగా.. 110 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, దోపిడీలు అరికట్టేందుకు ఒక్క కెమెరా వంద మంది జవాన్లతో సమానమన్నారు. కాలనీల్లో, ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను సీఐ వినాయకరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రష్మీసాధన పెరుమాళ్, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. ఆదేవిదంగా శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ అన్నారు. మొయినాబాద్ నూతన సీఐగా పవన్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన చిలుకూరు బాలాజీ దేవాలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగరాజన్ సీఐకి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం రంగరాజన్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతం కావడంతో నిత్యం శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంటుందని, అన్ని వర్గాల కృషితో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొడంగల్, జనవరి 3: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. కొడంగల్ మండల పరిధిలోని దర్గాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన దుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణం, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మొండిగౌరెల్లిలో క్వారీలు, క్రషర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం

- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

యాచారం, జనవరి 3 : మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 19లో క్వారీలు, క్రషర్ల ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. రెండు రోజులుగా కంట్రెనర్‌తో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు క్వారీలు, క్రషర్ల యజమానులు చకచకా పనులు సాగిస్తున్నారు. కాగా, ఎన్నికల ముందు గ్రామంలో మైనింగ్‌జోన్ ఏర్పాటు చేయనివ్వబోమని చెప్పిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు.. నేడు మాట మార్చారు. క్వారీలు, క్రషర్ల యజమానులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వం నుంచి అనుమతి ఉందని నమ్మించి యత్నం చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. నాయకులు ఎన్నికల వేళ ఒక మాట.. ఎన్నికలు ముగిసిన తరువాత మరో మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని మొండిగౌరెల్లి, యాచారం, గున్‌గల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాల రైతులు ధ్వజమెత్తుతున్నారు. ఈ సర్వేనెంబర్‌లో క్వారీలు, క్రషర్లు పెడితే వ్యవసాయం చేయలేమని, పండలాది ఎకరాల పంటలు, పట్టాభూములు బీళ్లుగా మారుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరితోనే మైనింగ్ జోన్ కింద పనులు చేసుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మైనింగ్‌జోన్ కింద పనులు చేసేముందు ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు చేయలేదని రైతులు మండిపడుతున్నారు. కాగా, మైనింగ్ అధికారులు తక్షణమే యాచారం మండలంలో పర్యటించి రైతుల అభిప్రాయం తీసుకొని మైనింగ్‌జోన్ రద్దు చేయించాలని కోరుతున్నారు.


క్వారీలు, క్రషర్లు పెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న వ్యాపారులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం, జనవరి 3: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధి కప్పాడులో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని దరఖాస్తులు తీసుకున్నారు. కాగా, దరఖాస్తులో బ్యాంకు అకౌంట్ వివరాలు అడగలేదని పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా.. విచారణ అనంతరం లబ్ధిదారుల నుంచి బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే రైతు బంధు పథకం కింద సాయం పొందుతున్నవారు రైతు భరోసాకు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, కొత్తవారు మాత్ర దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే రేషన్ కార్డులేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల్లో అడిగిన వివరాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని తప్పులు దొర్లకుండా నింపాలన్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన జనానికి సిబ్బంది, వాలంటీర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, ఎంపీడీవో వెంకటమ్మ, సర్పంచ్ సామల హంసమ్మ, ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మునీర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కప్పాడు గ్రామస్తులు

రైస్‌మిల్లు అనుమతులు రద్దు చేయండి

ఎలిమినేడు శివారులో రైస్‌మిల్లు ఇండస్ట్రీ గోదాం పేరుతో అనుమతులు తీసుకుని రైస్ మిల్ నిర్మాణం చేస్తున్నారని, దాని అనుమతులు రద్దు చేయాలని కప్పాడు గ్రామస్తులు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రైస్‌మిల్ ఏర్పాటు చేస్తే దుమ్ము, ధూళితో జనం ఇబ్బంది పడతారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి



తాండూరు: సావిత్రి బాయి పూలే జయంతి వేడుకల్లో బీసీ సంఘం నాయకులు

తాండూరు, జనవరి 3: సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. తాండూరు పట్టణంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారురాలని, భారతీయ సంఘసంస్కర్త జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యక్షురాలు అనితరాజ్, మీడియా ఇన్‌చార్జి బస్వరాజ్, సంఘం నాయకులు దత్తాత్రేయ, ప్రవీణ్ పాల్గొన్నారు. అదేవిధంగా సాయిపూర్‌పూర్ ప్రైమరీ స్కూల్‌లో సావిత్రిబాయి పూలేజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ హాజరై సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, విద్యారాణి, మంజుశ్రీ గంగా, నాయకులు పర్యాద రామకృష్ణ, వీరేశం, శుభప్రద్ ట్రస్టు సభ్యులు శ్రీశైలం, చౌష్‌భాయ్, హరీష్, నరేష్‌గౌడ్, భానుప్రసాద్, చందుపటేల్ ఉన్నారు.

తాండూరు రూరల్: తాండూరు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాండూరు మండల ఇన్‌చార్జి నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మహిళల అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన వ్యక్తి సావిత్రిబాయిపూలే అని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం యాలాల మండలంలో మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోస్గి వెంకటయ్యగౌడ్, మెట్టికృష్ణ, మల్లేశం, శేఖర్, శ్రీనివాస్, మొగులయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సావిత్రిబాయిపూలే విగ్రహనికి పూలమాల వేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

బషీరాబాద్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బషీరాబాద్‌లోని గోసాయికాలనీ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు బుధవారం పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ బాలు, రమేష్‌గౌడ్, అనిల్‌కుమార్‌గౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్‌లోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కేంద్రం నిర్వాహకుడు, బీసీ సంఘం నాయకులు వడ్డె భీమారాజ్ సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు యు.రమేశ్‌బాబు, విద్యార్థులు భూమిక, ఐశ్వర్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలే విగ్రహానికి, భూలక్ష్మమ్మ చౌరస్తాలో ప్రజాసంఘాల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు హరిలాల్, పాపిరెడ్డి, శ్రీహరిరెడ్డి, టీవీవీ రాష్ట్ర నాయకులు రవీందర్‌గౌడ్, అనిల్ కుమార్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, శ్రీప్రియ, అనురాధ, శోభారాణి, వేణుగోపాల్, గౌస్, ఖలీల్, బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమ: దిర్సంపల్లిలో సావిత్రి బాయిపూలే దంపతుల విగ్రహాలకు సర్పంచ్ శాంతాకొండారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శిరీష, హన్మంతు, ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పరిగిలో గల కొడంగల్ చౌరస్తాలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన ఎం.అశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, మాజీ ఎంఎంసీ చైర్మన్ సురేందర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, డీసీసీ కార్యదర్శి హన్మంత్, కృష్ణ, నాగేశ్వర్ తదితరులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు నాగేశ్, మునీరు, రవికుమార్‌లు, కాంగ్రెస్ నాయకులు ఆనెం ఆంజనేయులు, శివకుమార్, ఎస్.రామకృష్ణ, పినర్సింహులు, అక్బర్ పాల్గొన్నారు.

కులకచర్ల: సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, కేవీఎం పాఠశాలల్లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర గురించి కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ దేవి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్ రావు, సర్పంచ్ సౌమ్య వెంకటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని చెన్‌గోముల్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం హెచ్ఎం స్వరూపా అధ్యక్షతన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మండల విద్యాధికారి హరిశ్చందర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యత ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసర: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శామీర్‌పేట: శామీర్‌పేటలోని గురుకుల మహిళ డిగ్రీ కళాశాల్లో సావిత్రిబాయి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఇష్రత్, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నవాబుపేట: సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా నవాబుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం స్వేరోస్ నెట్ వర్క్ వికారాబాద్ వారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మల్లేశం, రాములు, రవీందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



పరిగి: సావిత్రిబాయి, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే



కొడంగల్: వీబీఆర్ ఇనిస్టిట్యూట్‌లో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న శిక్షణ కేంద్రం నిర్వాహకులు



శామీర్‌పేట: గురుకుల డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఇష్రత్, అధ్యాపకులు

దరఖాస్తులకు దళారులను ఆశ్రయించొద్దు



తాండూరు రూరల్: కోటబాస్పల్లి ప్రజాపాలన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: నాగసముందర్ గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, జనవరి 3: ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో లబ్ధిదారులు ఎవరూ దళారులను ఆశ్రయించొద్దని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని మల్కాపూర్, కొత్లాపూర్, కోటబాస్పల్లి రూర్బన్ పథకం కింద నిర్మాణం చేపట్టిన రూ.79లక్షల అభివృద్ధి పనులకు బుధవారం తాండూరు మండల ఎంపీపీ ఎస్.అనితా రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనితాగౌడ్, జడ్పీటీసీ గౌడి మంజుల, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య, వ్యవసాయ ఏడీ రుద్రమూర్తి, ఏవో రజిత, డీఈ వెంకట్‌రావు, ఏఈ నందిని, సర్పంచ్‌లు కుర్వ నాగార్జున, విజయలక్ష్మి, బి.సాయిలు, స్వరూపా, ఎస్.రవీందర్‌గౌడ్, రవి సింధేనాయకులు పాల్గొన్నారు. అభయహస్తంలో భాగంగా ప్రజాపాలనలో అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని తాండూరు మండల ఎంపీపీ ఎస్.అనితాగౌడ్ అన్నారు. అదేవిధంగా మండలంలోని తమ స్వగ్రామం సంగెంకలాన్‌లో బుధవారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, ఎమ్మెల్యే కుమారుడు అభిలాష్‌రెడ్డి, సర్పంచ్ ఎస్.మేఘనాథ్‌గౌడ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు పట్టణంలోని 25వార్డులో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని దరఖాస్తులకు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు రత్నమాల, మధుబాల, ప్రభాకర్‌గౌడ్, బీమ్ సింగ్, మాజీ కౌన్సిలర్‌లు అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

పూడూరు: చీలాపూర్‌లో సర్పంచ్ రాములు అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల ప్రజాపాలనలలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుందర్, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, రామస్వామి, నర్సింహులు, వసంత రెడ్డి, గుట్టకుర్వ రాంచంద్రయ్య, సత్యమ్మ, ఎండీ.షబానా పాల్గొన్నారు.



తాండూరు రూరల్: సంగెంకలాన్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీపీ అనితాగౌడ్

పరిగి: గడిసింగాపూర్, సయ్యద్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం జరిగింది. గడిసింగాపూర్‌లో ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, ఎంపీడీవో శేషగిరిశర్మ, సయ్యద్‌పల్లిలో ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచి వెంటకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు.

యాలాల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో పుష్పలీల అన్నారు. మండలంలోని నాగసముందర్, కమాల్‌పూర్, రాఘవపూర్, అడాల్‌పూర్, బాణాపూర్, అన్నసాగర్ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

బషీరాబాద్: కాశీంపూర్, నవాల్గ, దామర్‌చెడ్, మాసన్‌పల్లి తదితర గ్రామ సభల్లో ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బషీరాబాద్ ఏఎంసీ చైర్‌పర్సన్ రథోడ్ శాంతిబాయి హాజరై దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎం.నర్సిరెడ్డి, సి.వెంకటయ్య, శాంతి, శివానాయక్, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: రేటిబండతండా, లగచర్ల, చిలుముల్‌మైలారం, నాజ్‌ఖాన్‌పల్లి, ఏర్పుమళ్ల, బురాన్‌పూర్, కాకర్లగండి తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సదస్సులను డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్ సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు దానయ్య, వెంకటేశ్, ఎంపీడీవో వెంకన్న గౌడ్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: అంగడిరైచూర్‌లో అధికారులు ప్రజాపాలన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

మోమిన్‌పేట్: అర్హులైన ప్రతీ ఒక్కరు అభయ హస్తం ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శైలజారెడ్డి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి తెలిపారు. మండలంలోని టేకులపల్లి, ఎన్కతల, కోలుకుంద, పాత కోలుకుంద గ్రామాల్లో అధికారులు బుధవారం ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆశమ్మ, సర్పంచ్‌లు బండ నవనీత విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలవేలమ్మ, పార్వతమ్మ, సురేశ్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: తిమ్మారెడ్డిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలనలో ఎంపీడీవో తిరుమలస్వామి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీపతిరెడ్డి, సాయన్న, మహిపాల్, పంచాయతీ కార్యదర్శి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, మండల ప్రత్యేకాధికారిణి సరళాదేవి, ఎంపీడీవో నాగవేణి, తహసీల్దార్ మురళీధర్, భీమ్‌రెడ్డి, బీఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ జనవరి 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఆరు గ్యారంటీల అమలుకు అర్హుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులతో గ్రామగ్రామాన సందడి నెలకొంది. పింఛన్లు, రైతు బంధు పథకాల లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించినా గ్రామాల్లో ఈ రెండింటికీ పెద్దఎత్తున దరఖాస్తులను సమర్పిస్తున్నారు. కొన్ని చోట్ల దరఖాస్తుల్లో పథకాల పూర్తి వివరాలు లేకపోవడంతో అర్హులు అయోమయానికి గురవుతున్నారు. నిరక్షరాస్యులు ఉంటే వారి దరఖాస్తులను సిబ్బంది పూరించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ సజావుగా సాగడం లేదు. కొన్ని చోట్ల దరఖాస్తు పత్రాలను జిరాక్స్ తీసుకోవాలని సిబ్బంది సలహా ఇస్తున్నారు. రేషన్ కార్డుల కోసం ఎలా దరఖాస్తు చేయాలో వివరాలు పొందుపరచకపోయినా భారీగా ప్రజలు తరలివస్తున్నారు. రోజువారీగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గడువు ముగిసిన తరువాత దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేంద్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల వెన్నెల రామకృష్ణుడు, తహసీల్దార్ శైలజ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు. డబీల్‌పూర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గీత భాగ్యరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, చప రాజు, అక్రమ్ పాష పాల్గొన్నారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రజాపాలనలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాములు, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



మేడ్చల్: దరఖాస్తులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



కీసర: చీర్యాల్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

మూడుచింతలపల్లి: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అనంతారం ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వత్సాలాదేవి, తహసీల్దార్ వాణిరెడ్డి, ఎంపీవో సునిత, సర్పంచులు నర్సింహరెడ్డి, ఆంజనేయులు, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

కీసర: చీర్యాల్‌లో జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి ప్రజాపాలన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీ నారాయణ, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, ఎంపీడీవో గ్యామా, వజ్రేష్ యాదవ్, ధర్మేందర్, మాధురి, లక్ష్మణ్ శర్మ, తిరుమల్ రెడ్డి, పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మున్సిపాలటీ పరిధిలోని ఆయా వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పర్యటించి, ప్రజా పాలన దరఖాస్తులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లుల మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ సాబెర్‌అలీ, కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మర్రిపల్లిగూడలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్, వెంకటాపూర్‌లో ఎంపీడీవో అరుణరెడ్డి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గీతా శ్రీనివాస్, మంగమ్మ, నరేష్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: ఎన్నికల్లో హామిలిచ్చిన మేరకు పేదల సంక్షేమం కోసం ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం 2021 దరఖాస్తులను స్వీకరించారు. శామీర్‌పేటలో సర్పంచ్ బాలమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లు విచ్చేసి పరిశీలించారు.

ప్రజాపాలనలో ఉద్రిక్తత

శామీర్‌పేటలో బుధవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలు విచ్చేశారు. ఆ ప్రజాపాలనలో కాంగ్రెస్ నాయకుడు వజ్రేష్‌యాదవ్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుదర్శన్ బుజంపై చేయివేసి మాట్లాడడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఇరువర్గాల నాయకులు తోపులాడారు. దీంతో ఇరు పార్టీల మధ్య తీవ్ర ఉద్రిక్తత పరిస్థితికి దారి తీసింది. ఆ గొడవ సద్దుమణిగేలా అక్కడే ఉన్న పోలీసులు ఇరు పార్టీల నాయకులను చదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, బీఆర్ఎస్ నాయకులపై కక్షగట్టి దాడులు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుదర్శన్ హెచ్చరించారు.

గడప గడపకు అయోధ్య రామయ్య అక్షింతలు

ఘట్‌కేసర్, జనవరి 3: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని అయ్యప్ప ఆలయంలో శ్రీరాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమనారెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, చిన్న నర్సింహులుగౌడ్, శంకర్‌గౌడ్, కేఎం రెడ్డి, యదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంలోని అవుషాపూర్‌లో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతలు గడప గడపకు పంపిణీ చేశారు. గ్రామంలోని ఉమామహేశ్వరాలయంలో అక్షింతలకు సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మశ్చేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో ఇంటింటికి శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి



ఘట్‌కేసర్: అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తూ కరపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, తదితరులు

వైభవంగా మైసమ్మ బోనాలు



దౌల్తాబాద్: మైసమ్మ దేవతకు బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

దౌల్తాబాద్, జనవరి 3: మండలంలోని సలీంపూర్ గ్రామంలో బుధవారం గ్రామస్థులు బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు బోనపు కుండలతో గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగింపుగా బయలుదేరి ఆలయంలో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనదారుల బారులు



పెట్రోల్ బంక్ దగ్గర బారులు తీరిన వాహనదారులు

కులకచర్ల, జనవరి 3: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ దగ్గర వాహనదారులు పెట్రోల్ కోసం బుధవారం బారులు తీరారు. స్థానికంగా మూడు పెట్రోల్ బంక్‌లు ఉన్నా ఒకే బంక్‌లో పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉండటంతో ఉదయం నుంచి వాహనదారులు బారులు తీరారు. వాహనాల్లో ట్యాంకులు ఫుల్ చేయించుకోవడంతో పాటు క్యాన్‌లు, బాటిళ్లల్లో పెట్రోల్, డిజీల్ తీసుకెళ్లారు.

ఎలక్ట్రిసిటీ డీఈని కలిసిన నాయకులు



డీఈ సంజీవ్‌లుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు

వికారాబాద్, జనవరి 3: వికారాబాద్ విద్యుత్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ ఎలక్ట్రిసిటీ డీఈ సంజీవ్‌లను కలిసి బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ విద్యుత్ సర్కిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డి.ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, నాయకులు మధుసూదన్ రెడ్డి, సీహెచ్ కృష్ణ, శ్రీకాంత్, రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

శబరిమలకు బయల్దేరిన అయ్యప్పస్వాములు



ఎన్కతల నుంచి శబరికి బయల్దేరి వెళ్తున్న అయ్యప్పస్వాములు

మోమిన్‌పేట్, జనవరి 3: మండలంలోని ఎన్కతల గ్రామంలో బుధవారం శ్రీశనీశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అయ్యప్పస్వామి, మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఎనిమిది మంది స్వాములు శబరిమలకు బుధవారం బయల్దేరి వెళ్లారు. 40రోజులుగా అయ్యప్ప దీక్షలు చేపట్టిన స్వాములు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఇరుముడులతో శబరిమలలో అయ్యప్పస్వామి దర్శనం కోసం బయలుదేరారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం

శామీర్‌పేట, జనవరి 3: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంత రావులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభాకర్‌గౌడ్

క్యాలెండర్ ఆవిష్కరణ



మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ

మేడ్చల్ జనవరి 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖల చేతులమీదుగా టీజీఓస్ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ యూనియన్ నూతన 2024 క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్.నరహరి రావు, ప్రధానకార్యదర్శి ఎం.రాంచందర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ తిరుణాల జాతర

యాలాల, జనవరి 3: మండలంలోని ముద్దాయిపేట్ రేణుకా ఎల్లమ్మ తిరుణాల జాతర నేటి (గురువారం) నుంచి కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త దేవగారి రాములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రాత్రి 8గంటలకు అమ్మవారి ఊరేగింపు, శుక్రవారం సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు సిడె కార్యక్రమం, అదే రోజు సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6వ తేదీన శనివారం సాయంత్రం చుక్కబోనాలు, 7వ తేదీ ఆదివారం సాయంత్రం 4గంటలకు రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

దోమ, జనవరి 3: చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన ఎండీ.యూసుఫ్(45) మూడు రోజుల కిందటగ్రామ సమీపంలోని చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు అతడి ఆచూకీ కోసం ఎదురు చూశారు. చెరువులో గల్లంతైన వ్యక్తిని బుధవారం బయటకు తీశారు. మృతుడి తల్లి ఫాతీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.



యూసుఫ్ (ఫైల్)